క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న అమ్మవారు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో రాజరాజేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆధుర్తి రామకృష్ణ,విజయలక్ష్మి దంపతులతో ఆలయ ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఉదయాన్నే తొలిపూజ చేయించారు. అమ్మవారికి స్వీట్లు, తదితర 101 రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. గ్రామస్తులతో పాటు జిల్లా నలుమూలలు నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

కుటుంబ ఆరోగ్య సర్వే



సర్వే చేస్తున్న సిగ్మా రీసెర్చ్ కన్సల్టెన్సీ సభ్యులు

శృంగవరపుకోట: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సర్వే సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఆలుగుబిల్లి గ్రామంలో రెండో రోజు మంగళవారం జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే కొనసాగింది. గ్రామంలో సుమారు 300 కుటుంబాల ఆరోగ్య వివరాలను సిగ్మా రీసెర్చ్ కన్సల్టెన్సీ ఏజెన్సీ వారు సేకరించారని కొట్టాం వైద్యాధికారి జి.లావణ్య చెప్పారు. అయిదేళ్లకు ఒకసారి ఈసర్వే చేసి ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి, వాటిని నమోదు చేస్తామంటూ సర్వే టీమ్ సభ్యులు తెలిపారు. సర్వే టీమ్ సూపర్‌వైజర్ ఏ.పార్థసారథి, సభ్యులు బి.తేజేశ్వరనాథ్, కె.గోపి, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు గురమ్మ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ



లైబ్రేరియన్ శ్రీధర్‌కు పుస్తకాలు అందిస్తున్న త్రినాథ్

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖాగ్రంథాలయానికి స్థానిక జాబిలి క్రీ పాయింట్ యజమాని దొడ్డి త్రినాథ్ రూ.3500 విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలను వితరణ చేశారు. లైబ్రేరియన్ శ్రీధర్‌కు పుస్తకాలను మంగళవారం ఆయన అందజేశారు. దాతకు లైబ్రేరియన్ కృతజ్ఞతలు తెలిపారు.

సర్వసభ్య సమావేశం నేడు

జామి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సతీష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

ఎస్.కోట మేజర్ పంచాయతీలో..

శృంగవరపుకోట: ఎస్.కోట మేజర్ పంచాయతీ పాలకవర్గ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఈఓ పాత్రో మంగళవారం తెలిపారు. సర్పంచ్ సంతోషికుమారి అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ సమావేశానికి పంచాయతీ వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

నేడు 'గడప గడపకు మనప్రభుత్వం'

దత్తిరాజేరు: మండలంలోని దాసుపేటలో బుధవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కార్యక్రమంలో పాల్గొంటారని, మండల అధికారులు, సంబంధిత సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి



ఆస్పత్రిలో ఆక్సిజన్ నిల్వలను పరిశీలిస్తున్న ఆర్‌ఎంఓ చంద్రశేఖర్‌నాయుడు

గజపతినగరం: దేశవ్యాప్తంగా మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని గజపతినగరం ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంఓ ఎం.చంద్రశేఖర్ నాయుడు సూచించారు. స్థానిక ఆస్పత్రిలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు సమక్షంలో రోగులకు కరోనాపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆస్పత్రిలో ఆక్సిజన్ నిల్వలను పరిశీలించారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు



గజపతినగరం రూరల్: పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు అప్పలనరసయ్య, కడుబండి



కొత్తవలస: పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి



చీపురుపల్లిరూరల్(గరివిడి): లబ్ధిదారులకు సీఎం సందేశపత్రాన్ని అందజేస్తున్న అధికారులు, నాయకులు

గజపతినగరం రూరల్: రాష్ట్రంలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, పారదర్శకంగా అర్హులకు పథకాలు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని కాలంరాజుపేట సచివాలయం పరిధి డోలపాలెం గ్రామంలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతీ కుటుంబానికి పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. స్థానిక సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, ఎంపీటీసీ జగదీష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శన్, తహసీల్దార్ అరుణ, జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, మండల గృహ సారథుల కన్వీనర్ కనకల సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బూడి వెంకటరావు, నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, పల్లి సంజీవ్‌రావు, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించేందుకే 'గడప గడపకు' – ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా గడప గడపకూ వెళుతున్నామని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తవలస సచివాలయం–1 పరిధిలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబుతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. స్థానికులు చెప్పిన సమస్యలను ఎమ్మెల్యే నమోదు చేసుకుని, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి పేదవాడే అండదండా అని అన్నారు. జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, నాయకులు మేలాస్త్రీ అప్పారావు, గొరపల్లి రవి, సాల్మన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం

చీపురుపల్లిరూరల్(గరివిడి): సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నారని గరివిడి మండల ప్రజాప్రతినిధులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీ జి.వెంకటప్పలరాజు అన్నారు. గరివిడి మండలం తోండ్రంగి గ్రామంలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ జి.భాస్కరరావు, ఎంఈఓ పి.రామారావు, స్థానిక నాయకులు పిల్ల అప్పలనాయుడు, జమ్ము సతీష్, సర్పంచ్‌లు పొన్నాడ కుమార్,గుడివాడ తమ్మినాయుడు, ముద్దాడ రమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రూనీస్‌లక్ష్మికి జన్మదిన శుభాకాంక్షలు



మాజీ ఎంపీ రూనీస్‌లక్ష్మి పుట్టినరోజు వేడుకలను నిర్వహిస్తున్న గరివిడి మండల నాయకులు



కేక్ కట్ చేస్తున్న వాగ్దేవి విద్యా సంస్థల కరస్పాండెంట్ మహేశ్వరరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విజయనగరం మాజీ ఎంపీ బొత్స రూనీస్‌లక్ష్మి పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ బమ్మిడి అప్పలస్వామి, కాపుశంబాం పీఏసీఎస్ అధ్యక్షుడు లెంక శ్రీరాములు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ రూనీస్ పుట్టినరోజు వేడుకలు

కొత్తవలస: విజయనగరం మాజీ ఎంపీ బొత్స రూనీస్ పుట్టినరోజు వేడుకలను వాగ్దేవి విద్యా సంస్థల ఆధ్వర్యంలో వియ్యంపేట సమీపంలోని అమరావతి విద్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాగ్దేవి విద్యా సంస్థల కరస్పాండెంట్ కె.మహేశ్వరరావు కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు.కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఈ.కుమార్ బాబు, అమరావతి విద్యాలయం బోధన సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ జగనన్న సైన్యం



కొత్తవలస: కొత్తవలసలో పథకాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో పథకాలను వివరిస్తున్న గృహసారథులు, నాయకులు



చీపురుపల్లిరూరల్: గరివిడి మండలంలోని వి.పి.రేగలో నిర్వహించిన కార్యక్రమంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు



బొండపల్లి: గొట్లాంలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రమణ



బొండపల్లి: దేవుపల్లిలో పథకాలను వివరిస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ రఘు,ఎంపీటీసీ వెంకటలక్ష్మి



గుర్ల: పెనుబర్తిలో పథకాలను వివరిస్తున్న నాయకులు



దత్తిరాజేరు: సరయ్యవలసలో పథకాలపై ఆరా తీస్తున్న నాయకులు, గృహసారథులు



మెరకముడిదాం: సిరియాలపేటలో పథకాలను వివరిస్తున్న ఎంపీటీసీ సావిత్రమ్మ

'జగనన్నే మా భవిష్యత్ – మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో అయిదో రోజు మంగళవారం ఉత్సాహంగా సాగింది. ఇంటింటికీ వెళుతున్న గృహసారథులు, సచివాలయకన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సర్వే చేసి ప్రజల అభిప్రాయాలు సేకరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనకు, గత టీడీపీ ప్రభుత్వం పాలనకు తేడాలను వివరించారు. అనంతరం ప్రజల అనుమతితో వారి ఇళ్లకు 'మానమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించారు. కొత్తవలసలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

భూరీసర్వేకు సహకరించండి



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌మిశ్రా, తదితరులు

బొండపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న సమగ్రభూరీసర్వేతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, రైతులు సర్వేకు సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌మిశ్రా కోరారు. మండలంలోని అంబటివలస గ్రామంలో డ్రోన్ సర్వేను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎన్నోఏళ్లుగా ఎదుర్కొంటున్న భూసమస్యలకు రీసర్వేతో పరిష్కారం లభించనుందని చెప్పారు. సర్పంచ్ ఎస్.కనవయ్య, ఎంపీటీసీ తాళ్ల పూడి అప్పలనాయుడు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



హిందీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు

గంట్యాడ: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులు దక్షిణ భారత హిందీ ప్రచార సభ వారు నిర్వహించిన హిందీ ప్రాథమిక పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థినులు ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి మంగళవారం తెలిపారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ నుంచి వచ్చిన సర్టిఫికెట్లను విద్యార్థినులకు అందజేశారు. హిందీ పండిట్ సంతోషిని, విద్యార్థినులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినులు అభినందించారు.

స్కూళ్లు తెరిచిన వెంటనే జేవీకే కిట్ల పంపిణీ



సీఆర్పీలు, ఎంఆర్పీ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంఈఓ బూసినాయుడు

బొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్లను వేసవి సెలవులు అనంతరం, స్కూళ్లు తెరిచిన రోజు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఆర్పీలకు ఎంఈఓ ఎం.బూసినాయుడు సూచించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బందితో జేవీకే కిట్ల పంపిణీపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యా కానుక కిట్లు ఇప్పటికే మండల కేంద్రానికి ప్రభుత్వం చేరవేసిందని చెప్పారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



కోర్టు ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

శృంగవరపుకోట: ఢిల్లీలో సీనియర్ న్యాయవాది వీరేంద్ర అర్వాల్ హత్యకు నిరసనగా రాష్ట్ర, జిల్లా న్యాయవాద సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. న్యాయవాదులు నల్లరిబ్బన్లు ధరించి కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, కార్యదర్శి డబ్ల్యూ.ఎస్.శర్మ మాట్లాడుతూ ఢిల్లీ న్యాయవాది వీరేంద్ర అర్వాల్ హత్య దారుణమని, దేశంలో పేట్రేగిపోతున్న ఆరాచకత్వానికి ఇది నిదర్శనం అన్నారు. కూలిపోతున్న వ్యవస్థలను నిలబెట్టేందుకు పనిచేస్తున్న న్యాయవ్యవస్థలో భాగమైన న్యాయవాదులను కక్షగట్టి హత్య చేస్తే ప్రజాస్వామ్య మనుగడ, వ్యక్తిస్వేచ్ఛ ఏమవుతాయంటూ ప్రశ్నించారు. ప్రభుత్వాలు కేసును నీరుగార్చకుండా దర్యాప్తు వేగవంతం చేసి కిరాతక చర్యకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. న్యాయవాదులు జి.సూరిదేముడు, జి.ప్రకాష్, బి.త్రిమూర్తులు, వి.రమణ, వి.ఈశ్వరరావు, టి.వి.ఆర్.మూర్తి, ఆర్.సత్యనారాయణ, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీ పరిధి ఆకులపేట గ్రామంలో 2023– 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులను జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం వేతనదారులు పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందని చెప్పారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం తొందరగా పనులకు హాజరై ఎండ పెరగకముందే పనులు ముగించాలని, పని ప్రదేశంలో తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని వేతనదారులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఎంపీటీసీ గెరిడి రామదాసు, వార్డు మెంబర్ మీసాల సాయి, ఇప్పిలి తిరుమల పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

జామి: మండంలోని కుద్దిపాలెం గ్రామానికి చెందిన వివాహిత ముగడ పుణ్యవతి(36) అదృశ్యం అయినట్టు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ వీరబాబు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు... పుణ్యవతికి తన భర్తకు మధ్య గొడవ జరగడంతో ఆమె ఈనెల10వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్క గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

క్యాంపు వెళితే సమాచారం ఇవ్వండి

వేపాడ: ఎవరైనా బంధువుల ఇళ్లకు,క్యాంపులకు వెళ్లే వారు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందిస్తే వారి ఇంటి పరిసరాల్లో గస్తీ ఏర్పాటు చేస్తామని వల్లంపూడి ఎస్‌ఐ ఎస్.రాజేష్ తెలిపారు. పాటూరు గ్రామస్తులకు మంగళవారం అవగాహన కల్పించారు. రోడ్డు పక్కన ఉన్న ఇళ్లల్లో ఎక్కువగా దొంగతనాలు జరిగే అవకాశముందని, అలాంటి ఇళ్ల వారు క్యాంపులకు వెళితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఎవరైనా అపరిచిత వ్యక్తులు గ్రామంలో సంచరిస్తే సమాచారం అందించాలని కోరారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులాహ్వానం

గుర్ల: మండలంలోని చింతలపేట, తెట్టంగి, పకీరుకిట్టాలి, చోడవరం గ్రామాల్లో ఖాళీగా ఉన్న అయిదు గ్రామ వలంటీర్ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులాహ్వానిస్తూ ఎంపీడీఓ కల్యాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలకు చెంది, ఆసక్తి ఉన్న వారు ఈనెల 12వ తేదీ సాయంత్రంలోగా ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. 13న దరఖాస్తుల పరిశీలన, 15న ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొత్తవలస: మండల కేంద్రంలోని సంతమార్కెట్ సమీపంలో రామకృష్ణ మెడికల్ షాపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ ఎస్.బాలసూర్యారావు మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రధాన కూడళ్లలో చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశా జ్యోతి పూలే



చీపురుపల్లి: జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



కొత్తవలస: జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, అధికారులు, నాయకులు

సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను చీపురుపల్లి, గజపతినగరం, శృంగవరపుకోట నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలు విద్యాలయాల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. చీపురుపల్లిలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, కొత్తవలసలో ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లిరూరల్(గరివిడి): వ్యాసరచన పోటీల్లో విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న గరివిడి వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీను



గజపతినగరం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ తవుడు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరావు



వేపాడ: వల్లంపూడిలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత నేతలు, యువకులు



శృంగవరపుకోట: ఆర్టీసీ డిపోలో జ్యోతిరావుపూలేకు నివాళులర్పిస్తున్న డీఎం రమేష్, తదితరులు



లక్కవరపుకోట: జ్యోతిబాపూలే, సావిత్రీబాయిపూలే దంపతుల వేషధారణలో జమ్మాదేవిపేట ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు



దత్తిరాజేరు: కె.కొత్తవలస బాలుర గురుకుల పాఠశాలలో పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో, విద్యార్థినులు